తుమ్మే గాడిద

వాల్ బీరో



తుమ్మే గాడిద

వాల్ బీరో





అప్పన్న, మల్లన్న, సూరన్న అన్నదమ్ములు. వాళ్లు ముగ్గురూ బద్ధకస్తులు. ఆశపోతులు కూడా.

“ఇంట్లో ఏమీ లేవు!" ఒక రోజు వాళ్ల నాన్న అన్నాడు, “అప్పన్నా, పట్నం వెళ్లి పని సంపాదించు! ఇంటికి ఏమైనా తీసుకుని రా."



పని కోసమని అప్పన్న పట్నం బయలుదేరాడు.



“నా దగ్గర పని చెయ్యి,” అంది సత్తెమ్మ.



ఆమె దగ్గర అప్పన్న సంవత్సరం పైన ఒక రోజు పని చేశాడు.

అప్పుడు సత్తెమ్మ అతడికి ఒక బల్ల ఇచ్చింది.

“నీకు ఆకలి వేసినప్పుడు, “బల్లా, అన్నం వడ్డించు, అన్నం వడ్డించు!" అను. అప్పుడు బల్ల నీకు అన్నం పెడుతుంది,” అప్పన్నతో సత్తెమ్మ చెప్పింది.





అప్పన్న తన ఊరికి బయలు దేరాడు. సాయంత్రానికి బాగా అలసిపోవటంతో దారిలో ఒక పూటకూళ్ల ఇంట్లో ఆగాడు.

“నాకు ఆకలిగా ఉంది!” అప్పన్న అన్నాడు. “నాకు అన్నం వడ్డించు, అన్నం వడ్డించు!"





వెంటనే రకరకాల వంటకాలతో అన్నం వడ్డించింది బల్ల.

అప్పన్న తనివి తీరా భోజనం చేశాడు.

ఆ రాత్రి మహిమ గల బల్ల తీసుకుని దాని స్థానంలో మామూలు

బల్ల పెట్టాడు పూటకూళ్ల యజమాని!





ఇంటికి చేరుకున్న తరవాత అప్పన్న:

“బల్లా, అన్నం వడ్డించు, అన్నం వడ్డించు!” అన్నాడు.

కానీ, బల్ల ఏమీ చెయ్యలేదు.

“నువ్వు పిచ్చివాడివి, అప్పన్న!" తండ్రి, తమ్ముళ్లు అతడిని తిట్టారు.



మరుసటి రోజు పని కోసం మల్లన్న బయలుదేరాడు.

“నా దగ్గర పని చెయ్యి,” అంది సత్తెమ్మ.

ఆమె దగ్గర మల్లన్న సంవత్సరం పైన ఒక రోజు పని చేశాడు.

అప్పుడు సత్తెమ్మ అతడికి ఒక గాడిదను ఇచ్చింది.

“నీకు డబ్బు కావలసినప్పుడు, “తుమ్ము, గాడిదా, తుమ్ము!" అను.

అప్పుడు బల్ల నీకు డబ్బులు ఇస్తుంది,” మల్లన్నతో సత్తెమ్మ చెప్పింది.





మల్లన్న తన ఊరికి బయలు దేరాడు.

సాయంత్రానికి బాగా అలసిపోవటంతో దారిలో

పూటకూళ్ల ఇంట్లో ఆగాడు.

“నాకు ముందుగానే డబ్బులు కట్టాలి," పూటకూళ్ల యజమాని అన్నాడు.

అప్పుడు మల్లన్న, “తుమ్ము, గాడిదా, తుమ్ము!” అన్నా .



అంత డబ్బుని మల్లన్న అంతకు ముందు ఎప్పుడూ

చూడలేదు.



కానీ, ఆ రాత్రి మహిమగల గాడిదను తీసేసి

మామూలు గాడిదను పెట్టాడు పూటకూళ్ల యజమాని!





ఇంటికి చేరుకున్న తరవాత మల్లన్న:

“తుమ్ము, గాడిదా, తుమ్ము!" అన్నాడు.

కానీ, గాడిద ఏమీ చెయ్యలేదు.

“నువ్వు పిచ్చివాడివి, మల్లన్న!" నాన్న,

అన్నదమ్ములు అతడిని అరిచారు.



దాంతో, పని కోసం అందరికంటే చిన్నవాడైన సూరన్న బయలుదేరాడు. “నా దగ్గర పని చెయ్యి,” అంది సత్తెమ్మ. ఆమె దగ్గర సూరన్న సంవత్సరం పైన ఒక రోజు పని చేశాడు. అప్పుడు సత్తెమ్మ అతడికి ఒక కట్టెను ఇచ్చింది.

“నీకు ఎవరైనా హాని చేస్తే, “ఎగురు, కట్టె, ఎగురు!" అను. అప్పుడు కర్ర వాళ్లని కొడుతుంది,” సూరన్నతో సత్తెమ్మ చెప్పింది.



కట్టెతో సూరన్న పూటకూళ్ల ఇంటికి

చేరుకున్నాడు

“ఎగురు, కట్టె, ఎగురు!" అన్నాడు

సూరన్న.



మహిమగల కట్టె ఒక్క ఎగురు ఎగిరి
పూటకూళ్ల యజమానిని కొట్టసాగింది:
దఢేల్! దఢేల్! దఢేల్!

“కాపాడు! కాపాడు! కాపాడు!" అంటూ పూటకూళ్ల
యజమాని అరవసాగాడు. “కొట్టటం ఆపమని కట్టెకు
చెప్పు! మీవన్నీ నీకు అప్పజెపుతాను!"



అప్పుడు సూరన్న మహిమగల బల్ల, మహిమగల గాడిద, మహిమగల కట్టె తీసుకుని, ఇంటికి బయలుదేరాడు.




ఇంటికి చేరుకున్న తరవాత సూరన్న:

“బల్లా, అన్నం వడ్డించు, అన్నం వడ్డించు!” అన్నాడు.



తరవాత, “తుమ్ము, గాడిదా, తుమ్ము!“ అన్నాడు.

కానీ, సూరన్న, “ఎగురు, కట్టె, ఎగురు!" అనలేదు.



అయిపోయింది